# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 145 వ భాగం

## సూర్య వంశం – 13, రామ కథ - 3

క్రితం నెల మేఘనాధుడితో సహా తనవారందరూ పోయాక రావణుడు రాముడితో యుద్ధానికి వచ్చాడని చూసాం. అసలు వాల్మీకి రామాయణంలో ఇదంతా విపులంగా రాసారు గానీ ఇది భాగవతంలో రాముడి అవతారం. అందువల్ల చకచకా చెప్పేస్తున్నాడు పోతన రామాయణం అంతా.

క. సురపతిపంపున మాతలి
గురుతరమగు దివ్యరథముఁ గొనివచ్చిన, నా
ధరణీవల్లభుఁ డెక్కెను
ఖరకరుఁ డుదయాద్రి నెక్కు కైవడి దోఁపన్. [9-298]

పద్యం సులభంగా అర్థమైనా ఎంత నిఘూఢంగా ఉందో చూడండి. ఇంద్రుడు (సురపతి) పంపిన రథం ఎక్కాడు రాముడు (ధరణీ వల్లభుడు – వరహావతారంలో భూమిని లేదా ధరణిని ఉద్ధరించాడు కదా). ఎటువంటి రథం? గొప్పదైన దివ్యమైన రథం (గురుతరమగు దివ్యరథము), మాతలి తీసుకు వస్తే. ఆ ఎక్కడం కూడా ఎలా ఉందో ఉపమానం చెప్తున్నాడు – సూర్యుడు (ఖరకరుడు) ఉదయాద్రి మీదకి ఎక్కినట్టుగా. ఈ పద్యం చదివితే తెలిసేది ఏమిటంటే పోతన తాను రాస్తున్నది భాగవతం అని మరిచిపోలేదు, అందుకే ఇక్కడ రాముణ్ణి ముందు అవతారంగా ధరణీ వల్లభుడు అన్నాడు. రాక్షసులని చంపడానికి (లేదా అధర్మం చేసేవారిని తొలగించడానికి) వెళ్తున్నప్పుడు స్వచ్ఛమైన సూర్యుడిలా ఉంటాడుట వచ్చే భగవంతుడు. ఈ ఉపమానం రాబోయేది పూర్తి రాక్ష సంహారం అని చెప్పడానికే.

మ. చపలత్వంబున డాఁగి హేమమృగమున్ సంప్రీతిఁ బుత్తెంచుటో
కపటబ్రాహ్మణమూర్తివై యబల నా కాంతారమధ్యంబునం
దపలాపించుటయో మదీయశితదివ్యామోఘబాణాగ్ని సం
తపనం బేగతి నోర్చువాఁడవు? దురంతం బెంతయున్ రావణా! [9-300]

ఎదురుగా కనబడిన రావణుడితో అంటున్నాడు రామభద్రుడు – చపల మైన మనస్సుతో బంగారు లేడి (హేమ మృగము) వెనకగా, కపట బ్రాహ్మణుడిగా (కపటబ్రాహ్మణమూర్తివై) వచ్చి అబల అయిన సీతని ఎత్తుకెళ్ళడం కాదు యుద్ధం అంటే. నేను (మదీయ) వేసే దివ్యమైన శస్త్రాస్త్రాల (దివ్యామోఘబాణాగ్ని) ధాటికి తట్టుకోగలవా? ఇందులో రాముడు చెప్పేది చూడండి. నేను వేసే బాణం – అమోఘమైనది, లేదా తిరుగులేనిది.

దీని మీద చిన్న కథ చెప్పుకుని ముందుకి వెళ్దాం. అరణ్యవాసంలో ఉన్నప్పుడు ఓ రోజున సీత వడిలో తలపెట్టుకుని పడుకున్నాడు రాముడు. అప్పుడో కాకి వచ్చి సీతని పొడవడం మొదలుపెడితే, కదలకుండా కూర్చుందిట సీత, రాముడికి నిద్రాభంగం అవుతుందేమో అని. కొంతసేపటికి రాముడికి మెలుకువొచ్చింది. జరిగినది చూసి ఒక దర్భ తీసి బ్రహ్మాస్త్రం మంత్రించి వదిలాడుట ఆ కాకి మీద. ముల్లోకాల్లో తిరిగినా ఎవరూ దాని నుంచి తప్పించలేనప్పుడు మరోసారి రాముడి దగ్గిరకొచ్చాక బుద్ధి వచ్చింది. రామబాణం వెనక్కి తిరిగేది లేదు కనక ఏదో ఒకటి ఆహుతి అవ్వాల్సిందే. అలా ఒక కన్ను ఇచ్చి గుడ్డిదై వెనక్కి వెళ్ళింది. ఇదే విషయం మరోసారి రాముడు సాగరం దాటేటపుడు చూడవచ్చు. సముద్రుణ్ణి దారి ఇవ్వమంటే ఇవ్వనప్పుడు అస్త్రం తీసాడు వదలడానికి – బయటకి వచ్చిన సముద్రుడు చెప్తాడు, 'అలా దారి ఇవ్వడం నా స్వభావానికి విరుద్ధం కనక రాళ్ళు వేసి సేతువు కట్టుకోండి ఆ రాళ్ళు మునగకుండా నేను చూస్తాను.' అయితే ఎక్కుపెట్టిన బాణం సంగతో? రామ బాణం అమోఘం కదా? దాన్ని దూరంగా ఉత్తరంగా ఉన్న తీర్ధంలో ఉండే ఉగ్రస్వభావుల మీద ప్రయోగించు అంటాడు సముద్రుడు. ఇదే వాడుకలో ఉన్న పదం కూడా. ఏదైనా మందు పనిచేస్తుందా అనేదానిక్కూడా 'రామబాణంలా పనిచేస్తుంది' అనడం ఉంది.

మ. బలువింటన్ గుణటంకృతంబు నిగుడన్ బ్రహ్మాండ భీమంబుగా
బ్రళయోగ్రానలసన్నిభం బగు మహాబాణంబు సంధించి రా

జలలాముండగు రాముఁడేసె ఖరభాషాశ్రావణున్ దేవతా
బలవిద్రావణు వైరిదారజనగర్భస్రావణున్ రావణున్. [9-303]

రావణుడి మీద బలమైన మహాబాణాలు సంధించాడు రాముడు. ఎటువంటివాడీ రావణుడు? దేవతల సైన్యాలని పారదోలేవాడు (దేవతా బలవిద్రావణుడు), దారుణమైన పదజాలం వాడుతూ (ఖరభాషాశ్రావణున్), శతృవుల భార్యలకి గర్భస్రావాలు (వైరిదారజనగర్భస్రావణుడు) కలిగించేవాడు, వారి భర్తలని చంపేసి. అయితే రాముడో? రాజులలో శ్రేష్టుడు (రాజలలాముండు). ఈ బాణాలు వేయడానికి వాడిన బలమైన విల్లు – కోదండం, చేసే శబ్దం బ్రహ్మాండ భీమంబుగా ఉందిట. పోతన ఈ పద్యంలో "ణ" అనే అక్షరం ఎంత సులభంగా వాడాడో గమనించారా? ఇదే ప్రయోగం మరోసారి ముందు పద్యంలో కనిపిస్తుంది.

క. దశరథసూనుండేసిన
విశిఖము హృదయంబుఁదూఱ వివశుం డగుచున్
దశకంధరుండు గూలెను
దశవదనంబులను రక్తధారలు దొరఁగన్. [9-304]

అలా రాముడు (దశరథసూనుండు) వేసిన విశిష్టమైన బాణం (విశిఖము) రావణుడి ప్రాణం తీసింది, పది మొహలలో రక్త ధారలు కురుస్తూండగా. దీంతో రామ రావణ యుద్ధం అయిపోయింది. ముందు వచ్చేది ఉత్తర రామాయణం. అయితే ఈ ఉత్తర రామాయణం అసలు వాల్మీకి రామాయణంలో లేదనే కొంతమంది వాదన ఉంది. అయినా మనం చూసేది భాగవతం కనక పోతన రాసినది మాత్రం చూద్దాం.

క. దురితముఁ దలపరు గానరు
జరుగుదు రెటకైన నిమిష సౌఖ్యంబుల కై
పరవనితాసక్తులకును
బరధనరక్తులకు నిహముఁ బరముం గలదే? [9-310]

వ. అని విలపింప నంత విభీషణుండు రామచంద్రుని పంపుపడసి, రావణునకు దహనాది క్రియలు గావించె; నంత రాఘవేంద్రుండు నశోకవనంబున కేఁగి, శింశుపాతరు సమీపంబు నందు.

[9-311]

జరిగినదంతా చూసి రావణుడు పోయాక విభీషణుడు అంటున్నాడు – పర వనితలని ఆశించేవారు (పరవనితాసక్తులు), (అవతలి వారి ధనాన్ని ఆశించేవారు (పరధనరక్తులూ), క్షణిక సౌఖ్యాలకై (నిమిష సౌఖ్యంబులకై) తప్పూ వప్పూ అనేవి చూసుకోరు, ఇది పాపం (దురితము) అని కూడా ఆలోచించరు. ఇటువంటి వారికి ఇహం పరం అనేవి ఉంటాయా? అలా విలపించే విభీషణుడిని దగ్గిరకి తీసి రావణుడికి దహనం, మిగతావి చేయించాడు రాముడు.

పై వచనంలో రాముడు అశోకవనంలోకి వెళ్ళి సీతని చూసాడని చెప్తున్నాడు కానీ వాల్మీకి రామాయణంలో రాముడు పధ్నాలుగేళ్ళు గడవకుండా నగరంలోకి అడుగుపెట్టలేదు అని ఉంటుంది.

శా. దైతేయప్రమదా పరీత నతిభీతన్ గ్రంథి బంధాలక
వ్రాతన్ నిశ్వసనానిలాశ్రుకణ జీవం జీవదారామ భూ
జాతన్ శుష్కకపోల కీలిత కరాబ్జాతం బ్రభూతం గృశీ
భూతం బ్రాణసమేత సీతఁ గనియెన్ భూమీశుఁ డా ముందటన్. [9-312]

రాముడు చూసిన సీత (భూజాత) ఎలా ఉందంటే – చుట్టూ ఉన్న రాక్షసుల వల్ల భయంతో (అతి భీతన్), జుట్టు చిక్కులతో అట్టలు కట్టి ఉంది (గ్రంథి బంధాలక వ్రాతన్), నిట్టూర్పులు విడుస్తూ కన్నీరు కారుస్తూ (నిశ్వసనానిలాశ్రుకణ) కృశించి ఉంది (కృశీభూతన్).

ప్రతీ వారు రామాయణం ఎందుకు చదవాలో ఈ పద్యం చెప్తుంది. అందులోనూ ఎవరైనా మహిళలు వంటరిగా ఉంటే లొంగదీసుకుందాం అనుకునే వారికి ఇది తెలియాలి. ఈ మధ్య మనం చూస్తున్నాం ఇటువంటివి జరగడం కూడా. ఎవరినో ఎత్తుకుపోవడం అమానుషంగా ప్రవర్తించడం ఇవన్నీ సర్వ సాధారణం అనుకోవడం. వంటరిగా ఉన్న మహిళలు ఎలా ఉంటారో చెప్తున్నాడు పోతన - భయంతో, కృశించి, కన్నీరు కారుస్తూ.

రావణుడిలా ఎంత డబ్బు ఇస్తామన్నా, ఎన్ని భోగాలు చూపిస్తామన్నా స్త్రీ హృదయం లో ఉండేది అవి కాదు కదా? అందులోనూ రాముడిలాంటి భర్త ఉన్నవారికి. మా ఊర్లో రామాయణం చదివే బులుసు ప్రకాశం గారు అనే మా తెలుగు అయ్యవారు గారు ఇటువంటి పద్యాలు చదువుతూ మధ్యలో ఆపి పై పంచతో కన్నీళ్ళు తుడుచుకునేవారు. అమ్మవారి ఎంత కష్టపెట్టాడో ఈ దుర్మార్గుడైన రావణుడు అంటూ.

వ. కని రామచంద్రుండును దాపంబు నొంది, భార్యవలన దోషంబు లేకుంట వహ్నిముఖంబునం బ్రకటంబుజేసి, దేవతల పంపున దేవిం జేకొని.

[9-313]

తర్వాత అగ్ని ప్రవేశం ఘట్టంలో అగ్నిదేవుడు (వహ్ని) నోటితో చెప్పగా విని, దేవతలు కూడా చెప్పగా సీతని స్వీకరించాడు. తర్వాత పని విభీషణుడికి పట్టం కట్టడం. పోతన "ణ" అక్షరాన్ని ఎలా వాడాడో మరోసారి చూడండి.

ఉ. శోషితదానవుండు నృపసోముఁడు రాముఁడు రాక్షసేంద్రతా
శేషవిభూతిఁ గల్పసమజీవివి గమ్మని నిల్పె నర్థి సం
తోషణుఁ బాపశోషణు నదూషణు శశ్వదరోషణున్ మితా
భాషణు నార్యపోషణుఁ గృపాగుణభూషణు నవ్విభీషణున్. [9-314]

రాజులలో కెల్లా చంద్రుడివంటివాడు (నృపసోముఁడు); రాక్షసులని అంతమొందించిన వాడూ అయిన (శోషితదానవుండు) రాముడు విభీషణుడికి పట్టం కట్టాడు. ఆ విభీషణుడు అడిగినవారికి లేదనకుండా ఇచ్చి సంతోష పెట్టేవాడు (అర్థి సంతోషణుడు), పాప రహితుడు (పాపశోషణుడు), నిందించడం అనేది తెలియనివాడు (అదూషణుడు), కోపం తెలియనివాడు (శశ్వద – శాశ్వతంగా, అరోషణుడు – రోషం లేనివాడు), మితంగా మాట్లాడేవాడు (మితబాషణుడు), పెద్దలని గౌరవించి పోషించేవాడు (ఆర్యపోషణుడు), దయాగుణం కలవాడు (కృపాగుణ భూషణుడు).

ఇన్ని మంచి గుణాలు ఉన్న విభీషణుడికి రాముడు రాజ్యాధికారం ఇచ్చేటప్పుడు ఏమని దీవించాడో కూడా చెప్తున్నాడు పద్యంలో – అశేషమైన వైభవంతో చక్కగా కల్పాంతం వరకూ జీవించు అన్నాట్ట (అశేష విభూతి కల్ప

సమ జీవి). ఇదెందుకు అంటే, తాను ఇచ్చేది రాక్షస రాజ్యం (రాక్షసేంద్రత్), రావణుడు రాజ్యం చేసినట్టు విభీషణుడు చేయకూడదు. ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు ఆశీర్వాదం ఇమ్మంటే ఏమంటారు? మన తల మీద అక్షింతలు చల్లి 'దీర్ఘాయుష్మాన్ భవ, దీర్ఘ సుమంగళీ భవ, నూరేళ్ళు జీవించు' అంటారు కదా. అదైనా ఎలా జీవించాలి? మంచి వారిలా. ఈ పద్యం విషయంలో కూడా అదే అంటున్నాడు పోతన – విభీషణుడు ధర్మం తెల్సినవాడు కనక అటువంటి రాజు కల్పాంతం వరకూ ఉండాలి. అది అందరికీ మంచిది. అందుకే రాముడు 'అశేషమైన వైభవంతో చక్కగా కల్పాంతం వరకూ జీవించు' అంటున్నాడు.

వ. ఇట్లు విభీషణ సంస్థాపనుండయి రామచంద్రుఁడు సీతాలక్ష్మణ సమేతుండయి సుగ్రీవ హనుమదాదులం గూడికొని, పుష్పకారూఢుం డయి, వేల్పులు గురియు పువ్వులసోనలం దడియుచుఁ దొల్లి వచ్చిన తెరువుజాడలు సీతకు నెఱిఁగించుచు, మరలి నందిగ్రామంబునకు వచ్చె; నయ్యవసరంబున. [9-315]

అలా విభీషణుడికి రాజ్యం ఇచ్చాక అందరితో పాటు పుష్పకం ఎక్కి కనిపించే ప్రతీదీ చూపిస్తూ, తాము వచ్చినదారి, విశేషాలూ సీతకి చెప్తూ (దొల్లి వచ్చిన తెరువుజాడలు సీతకు నెఱిఁగించుచు), దేవతలు వర్షించే పుష్పాల కింద తడుస్తూ (వేల్పులు – దేవతలు, గురియు; పువ్వులసోనలం – పూలవర్షాలు, దడియుచు) నందిగ్రామానికి వచ్చాడు.

మరో కొంత తేడా ఇక్కడ. దారిలో ఇవన్నీ సీతకి చూపిస్తూ ఉన్నప్పుడు ఆవిడ సుగ్రీవుడి భార్యలని అందర్నీ కూడా అయోధ్య తీసుకెళ్దాం అని అడిగితే అక్కడ ఆగి వార్ని కూడా పుష్పకంలో ఎక్కించారని వాల్మీకి రామాయణం లో ఉంది. ఆ విషయం ఇక్కడ కుదించినట్టు కనబడుతుంది పోతన భగవతంలో. రామ పట్టాభిషేకం తర్వాత రాముడి వంశం ఎలా ముందుకి సాగుతుందో చెప్పాక ఈ సూర్యవంశం కథ ముగుస్తుంది భాగవతంలో. అవి వచ్చే నెల చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS